

- నెలవారీ మామూళ్లు.. వ్యాపారానికి కప్పం కట్టాల్సిందే..
- కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఇదే తరహా వసూళ్లు
- బాధితులకు అందని ద్రాక్షలా సేవలు
- దృష్టిపెట్టని పోలీసు శాఖ ఉన్నత అధికారులు

వసూల్ ఠాణాలు

దందాలకు నిలయాలుగా పోలీస్‌స్టేషన్లు

వరంగల్ క్రైం, మార్చి 30: అక్రమాలు, అన్యాయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ స్టేషన్లు దందాలకు నిలయాలుగా మారాయన్న ఆరోపణలున్నాయి. బాధితులకు అండగా నిలవాల్సిన ఠాణాలు డబ్బున్న వారికి భరోసా కేంద్రాలుగా నిలుస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు సమస్యలతో ఫిర్యాదులు ఇచ్చేందుకు వెళితే.. న్యాయం జరుగుతుందనే ఆశ బాధితులకు కల్పించే స్థితి పోలీస్‌స్టేషన్లలో లేదన్న ప్రచారం ఉంది. ఉన్నవారికి రెడ్ కార్పెట్ పరుస్తూ బాధితులను పట్టిపీడించే కేంద్రాలుగా స్టేషన్‌లు మారాయనే ఆరోపణలున్నాయి. ఆయా స్టేషన్‌ల పరిధిలో నడుస్తున్న వ్యాపారస్తులు కప్పం కడితేనే సరి.. లేదంటే వ్యాపారం జరగని దుస్థితి నెలకొన్నట్లు తెలిసింది. వ్యాపారాన్ని బట్టి నెలవారిగా స్టేషన్‌కు ముడుపులు చెల్లించాల్సిందేననే షర తు విధించినట్లు సమాచారం. ఇది పాటించని వ్యాపారులు ముందుకు సాగే పరిస్థితి ఉండదని తెలిసింది. నెలవారీ వసూళ్లకు స్టేషన్‌కు ఒక కింది స్థాయి ఉద్యోగిని ప్రత్యేకంగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. వరంగల్ నగర ప్రాంతంలోని చాలా ఠాణాలతో పాటు కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్టేషన్ల పరిధిలో ఇలాంటి ఆరోపణలున్నాయని సమాచారం. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీస్ ఠాణాలు.. వసూళ్లకు కేంద్రాలుగా మారడం, ఈ దందాలపై శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో సామాన్యులకు రక్షణ, న్యాయం అందని ద్రాక్షలా మారాయన్న చర్చజరుగుతోంది.

బాధితులను వదలని పరిస్థితి

ఏదైనా కేసు విషయమై ఫిర్యాదు ఇచ్చేందుకు వెళితే కిందిస్థాయి సిబ్బంది నుంచి స్టేషన్ అధికారి వరకు స్థాయిల వారీగా ముడుపులు కట్టాల్సిందేనన్న ప్రచారం ఉంది. కష్టాల్లో వచ్చిన వారికి రక్షణగా నిలవాలనే వాతావరణం స్టేషన్‌లో కనిపించదనే విమర్శలున్నాయి. ఆపదతో వస్తే అందినకాడికి దండుకున్నాకే కేసు పురోగతి కాస్త ముందుకు వెళుతుందన్న ఆరోపణలున్నాయి. ఫిర్యాదుదారు పక్షాన పోలీసులు నిలబడతారనే గ్యారంటీ సైతం ఉండదనే విమర్శలున్నాయి. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తి స్టేషన్ అధికారికి తెలిసినా, ఆర్థికంగా గట్టివాడైనా, రాజకీయ పలుకుబడి ఉన్నా అంతే సంగతులు.. ఫిర్యాదుదారు ఇచ్చిన ముడుపులు, ఫిర్యాదులు నీటిపాలు కావల్సిందేననే ఆరోపణలున్నాయి. పైరవీకారులదే స్టేషన్‌లో పైచేయిగా ఉంటుందనే ప్రచారం ఉంది. ప్రస్తుతం రియల్టర్లు స్టేషన్‌లను ఏలుతున్నారనే విమర్శలున్నాయి.

వ్యాపారానికి ఓ రేటు

వ్యాపారం చేసుకోవాలంటే సంబంధిత పోలీసు స్టేషన్‌లకు నెలవారి కప్పం కట్టాల్సిందేననే ప్రచారం ఉంది. వ్యాపారాన్ని బట్టి ఆయా స్టేషన్ అధికారులు నెలవారి మొత్తాలని నిర్ణయించి నిర్బంధంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా క్రషర్స్, బార్లు, వైన్స్, ఇసుక దందా, మొరం దందా, బియ్యం దందాలు చేసేవారు తప్పకుండా చెల్లించాలనే షరతు ఉన్నట్లు సమాచారం. నగరంలోని చాలా పోలీస్‌స్టేషన్లకు ఈ వ్యాపారుల నుంచి నెలవారీగా ముడుపులు అందుతున్నట్లు తెలిసింది. క్రషర్స్ నుంచి రూ.25వేల నుంచి 50వేల వరకు, బార్లనుంచి రూ.30వేలు, వైన్స్ నుంచి రూ.20, అక్రమ బి య్యం (పీడీఎస్) దందా చేసే వారు రూ.50వేలు నెలవారిగా చెల్లిస్తున్నట్లు తెలిసింది. నిత్యం ఇసుక, మొరం దందా చేసే వారి నుంచి ఆయా అడ్డాల నుంచి నెలవారి ముడుపులు అందుతాయనే ప్రచారం ఉంది.



అధికారులకు పంపకాలు

ఆయా స్టేషన్లకు అందే ముడుపుల్లో నుంచి స్థాయిని బట్టి తలా ఇంత పంపకాలు జరుపుతారనే విమర్శలున్నాయి. ఆయా స్టేషన్ అధికారులు పైస్థాయి అధికారులకు నెలవారీ మామూళ్లు ముట్టచెబుతారనే ఆరోపణలున్నాయి. దందాలు చేసేవారి నుంచి వసూలు చేసి పైస్థాయి అధికారులకు ఇస్తుంటారనే విమర్శలున్నాయి. ముడుపులు చెల్లించని స్టేషన్ అధికారులపై ఉన్నతాధికారులకు చిన్నచూపు ఉండటంతోపాటు శాఖాపరంగా జరిగే పనుల్లో అడ్డంకులు తప్పవనే ఆరోపణలున్నాయి. శాఖ అధికారులకు చెల్లించడంతో పాటు తనకు పోస్టింగ్ రావడానికి సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధి అవసరాలకు స్టేషన్ అధికారులు ఏటీఎంగా ఉపయోగపడతారనే ప్రచారం ఉంది. ప్రజాప్రతినిధి ఆయా స్టేషన్‌ల పరిధిలో నిర్వహించే సభలు, సమావేశాల ఖర్చులు పోలీస్ అధికారులపై రుద్దుతారనే ఆరోపణలున్నాయి. ఇన్ని రకాల ఖర్చులు భరించలేక ఆయా స్టేషన్‌ల పరిధిలోని వ్యాపారుల నుంచి నిర్బంధంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. మొత్తంగా నగరంలోని పలు స్టేషన్‌లు దందాకోరులకు రక్షణగా నిలుస్తున్నాయని ప్రచారం ఉండటం గమనార్హం.

ఉదాహరణకు కొన్ని..

- నగరంలోని గోపాల్‌పూర్ ఏరియాలో తమ స్థలంలో అక్రమంగా ప్రహరీ కడుతున్నారని, ఆపమని పోలీసులను ఆశ్రయించిన వారి నుంచి ఇటీవల బదిలీ అయిన ఒక పోలీస్ అధికారి రూ.1లక్ష తీసుకున్నట్టు తెలిసింది. ఈ పోలీస్ అధికారి ఉన్నది కొద్దిరోజులే అయినా ప్రతీ వివాదంలో తలదూర్చాడనే ఆరోపణలున్నాయి.
- నగరంలో పీడీఎస్ బియ్యం వ్యాపారం చేసే ఒక వ్యక్తి నాలుగు పోలీస్ స్టేషన్లకు రూ.50వేల చొప్పున పంపుతుంటాడని తెలిసింది. ఇతడికి పోలీస్ అధికారుల్లో చాలామందితో మంచి సంబంధాలున్నాయనే ప్రచారం ఉంది. ఇతడి నివాసంలో జరిగిన ఒక విందుకు పెద్దఎత్తున పోలీస్ అధికారులు హాజరై వివాదంలో ఇరుక్కున్నట్లు సమాచారం.
- కరీంనగర్ రోడ్డులో ఉన్న రెండుస్టేషన్ల పరిధిలో ఏడు క్రషర్లు ఉండగా, ప్రతీ క్రషర్ నుంచి వారి వ్యాపారాన్ని బట్టి నెలకు రూ.25వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. చెల్లించని వారిపై అనుమతుల్లేకుండా బాంబులు పెట్టి రాళ్ళ పేల్చుతున్నారని కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు సమాచారం.
- నగరంలో ప్రతీ బార్ నుంచి ఆయా స్టేషన్లకు నెలకు రూ.30వేల చెల్లిస్తారని సమాచారం. చెల్లించని బార్ల ఎదుట వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు పెడతారన్న చర్చ జరుగుతోంది.
- కరీంనగర్ మార్గంలో రెండు స్టేషన్ల పరిధిలో మూడు వైన్స్ ఉన్నాయి. ప్రతీ నెల ఆ దుకాణాల నుంచి రూ.60వేల చొప్పున చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇలా నగరంలోని ప్రతీ స్టేషన్ పరిధిలోని వైన్స్ వారు చెల్లిస్తుంటారని సమాచారం.



వంగరలో పీవీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భారతరత్న పీవీ..

- పురస్కారాన్ని బహూకరించిన కేంద్రం
- రాష్ట్రపతి ముర్ము నుంచి అందుకున్న మాజీ ప్రధాని కుమారుడు ప్రభాకర్‌రావు



రాష్ట్రపతి నుంచి భారతరత్న అవార్డు అందుకుంటున్న పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు

భీమదేవరపల్లి, మార్చి 30 : మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని బహూకరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం నలుగురికి భారతరత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అందజేయగా.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు గాను ఆయన కుమారుడు ప్రభాకర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభాకర్‌రావుతో పాటు ఆయన సోదరి సురభి వాణిదేవి, మనువడు కష్యప్ కూడా వెళ్లారు. ఇక పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని బహూకరించిన నేపథ్యంలో వంగరలోని పీవీ నివాసంలోని పీవీ విగ్రహానికి స్వామి రామానందతీర్థ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, కాంగ్రెస్ నాయకులు చిదురాల స్వరూప, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒల్లాల రమేష్, చెప్యాల చందారెడ్డి, శ్రీరామోజు మొండయ్య, రాంబాబు, సమ్మయ్య, రామకృష్ణ, లావణ్య తదితరులు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుతేజం పీవీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, మచ్చ లేని వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు దేశాన్ని పటిష్ఠంగా నిలిపాయని గుర్తుచేశారు.

నేడు జనగామ జిల్లాలో కేసీఆర్ పర్యటన



జనగామ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పులకు వస్తున్నారు. ఎండిన పంటల పరిశీలనలో భాగంగా ఆయన జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో ఎండిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ మీదుగా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాకు 10.30 గంటలకు చేరుకుంటారు. సుమారు అరగంట పాటు పంటలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి వెళ్తారు.

'ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాలి'

వరంగల్ కలెక్టరేట్, మార్చి 30: ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 14వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. వారికి ఏప్రిల్ 1నుంచి 3వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతుల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రింటెడ్ ఫామ్‌తో సహా అందించాలన్నారు. సాధ్యమైనంత మేరకు ఉద్యోగి ఓటరుగా నమోదైన ప్రాంతంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రీ ప్రింటెడ్ ఫామ్‌లో పేరు, ఎంప్లాయ్ కోడ్, ఎపిక్ కార్డ్‌లో తప్పులుంటే వెంటనే శిక్షణ కేంద్రాల్లోని బాధ్యుల దృష్టికి తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఆర్డీవోలు దత్తు, కృష్ణవేణి తెలిపారు.



పరీక్ష రాసి వస్తున్న పదో తరగతి విద్యార్థులు

ముగిసిన పది పరీక్షలు

- ఊపిరి పీల్చుకున్న అధికారగణం
- గతేడాది సంఘటనలతో పకడ్బందీ చర్యలు
- ఇళ్లకు పయనమైన విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 30: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. గత ఏడాది పరీక్షల్లో చోటు చేసుకున్న సంఘటనలతో ఈ ఏడాది ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. మూడంచెల భద్రత నడుమ ఈసారి పది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎక్క డా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పది పరీక్షలకు విజయవంతంగా పూర్తిచేశారు. ఈనెల 18న పరీక్షలు ప్రారంభం అయినప్పటి నుంచి విద్యాశాఖాధికా రులు టెన్షన్ టెన్షన్‌గానే గడిపారు. శనివారం జరిగిన సాంఘిక శాస్త్రంతో సాధారణ పరీక్షలు పూర్తి అయ్యాయి. సోషల్ స్టడీస్ పరీక్షకు వరంగల్ జిల్లాలో 99.85 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 9,455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 9,441 మంది హాజరుకాగా 14మంది గైర్హాజరయ్యారు. ఇక హనుమకొండ జిల్లాలో 99.88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 12,032 మంది విద్యార్థులకు గాను 12,018 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరయ్యారు.

పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు హాస్టళ్లను ఖాళీ చేసి వారి సొంత ఊళ్లకు బయలుదేరారు. ఉదయం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టళ్ల వద్ద వేచి ఉండి వారి పిల్లలను దగ్గరుండి ఇండ్లకు తీసుకెళ్లారు. దీంతో బస్టాండ్, రైల్వే స్టేషన్లు విద్యార్థులతో నిండిపోగా, కొంత మంది దగ్గరి ఊళ్ల నుంచి వచ్చిన వారు వారి పిల్లలను ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి తోడ్పాటు అందించిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు హనుమకొండ, వరంగల్ డీఈవోలు డాక్టర్ అబ్దుల్ హై, వాసంతి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో రద్దీగా హనుమకొండ బస్‌స్టేషన్

బంగారంపై దురాశతో వివాహిత హత్య

- ఘాతుకానికి పాల్పడిన స్నేహితుడు, అతడి ప్రియురాలు
- వివాహిత అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ , ఇన్‌సెట్లో నిందితులు



మృతురాలు సుప్రియ(ఫైల్)

నర్సంపేట టౌన్, మార్చి 30 : బంగారాన్ని దోచుకోవాలనే దురాశతో సహజీవనం చేస్తున్న ఓ జంట దుగ్గొండి మండలంలోని మైసంపల్లికి చెందిన ఓ వివాహితను కొట్టి, గొంతు నులిమి హత్యచేసి, మెడలోని పుస్తెలతాడు, ఇంట్లో ఉన్న నగలను దోచుకెళ్లిన సంఘటన ఇది. ఈ కేసులో నిందితులను పోలీసులు శనివారం అరెస్టుచేసి, వారి నుంచి నగలు, ఓ బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ కేసు వివరాలను వెల్లడించారు. ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన ఆకునూరి సుప్రియ(27)కు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లికి చెందిన వెంగళ రాజ్‌కిరణ్‌తో 2016లో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు న్నారు. రాజ్‌కిరణ్ హన్మకొండలోని ఓ ఎలక్ట్రానిక్స్ షాపింగ్ మాల్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే సుప్రియకు ములుగుకు చెందిన, హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ఫుడ్ డెలివరీ యాప్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న తాటిపల్లి శశికాంత్‌తో విద్యార్థి దశ నుంచి స్నేహం ఉంది. ఆ పరిచయం దృష్ట్యా సుప్రియ నెలరోజులుగా తరచూ శశికాంత్‌కు ఫోన్లు చేస్తూ తనకు అనారోగ్య సమస్యలు న్నాయని, ఆసుపత్రుల విషయమై వాకబు చేస్తోంది. అయితే సుప్రియ ఫోన్లు చేస్తున్న విషయం శశికాంత్‌తో సహజీవనం చేస్తున్న ములుగు జిల్లాకు చెందిన అజ్మీర శిరీషకు తెలిసి ఆమె శశికాంత్‌తో వాగ్వాదానికి దిగుతోంది. ఈ విషయమై శశికాంత్, శిరీష కొద్దిరోజుల మైసంపల్లికి వచ్చి ఇంకోసారి తమకు ఫోన్ చేయవద్దని సుప్రియను హెచ్చరించి వెళ్లారు. కానీ ఆ సమయంలో సుప్రియ ఇంట్లో ఒంటరిగా ఉండటం, ఆమె ఒంటిపై బంగారం ఉండటంతో ఎలాగైనా దోచుకోవాలనే దురాశ వారిలో పుట్టి.. సుప్రియను అంతమొందించాలని పథకం వన్నారు.

రెక్కీ నిర్వహించి..

కొద్దిరోజులకు సుప్రియ ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించి హైదరాబాద్ వెళ్లిపోయారు. మళ్లీ పథకం ప్రకారం ఇద్దరూ హైదరాబాద్ నుంచి ఈనెల 23న మధ్యాహ్నం 12గంటల సమయంలో బైక్‌పై సుప్రియ ఇంటికి చేరుకున్నారు. భర్త డ్యూటీ వెళ్లడం.. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి సుప్రియకు అనుమానం రాకుండా మాట్లాడగా.. శశికాంత్ తెలిసిన వ్యక్తి కావడంతో టీ పెట్టేందుకు సుప్రియ వంట గదిలోకి వెళ్లింది. ఈ క్రమంలోనే వారు సుప్రియను తీవ్రంగా కొట్టి కిందపడేశారు. ఆ తర్వాత శిరీష సుప్రియ కాళ్లను పట్టుకోగా.. శశికాంత్ గొంతు నులుమి హత్యచేసి సుప్రియ ఒంటిపైనున్న బంగారు పుస్తెలతాడు, ఇంట్లో ఉన్న బంగారు నగలు తీసుకుని బైక్‌పై పరారయ్యారు. ఆ తర్వాత నిందితులిద్దరూ హైదరాబాద్‌లోని ఏఎస్ రావు నగర్ ఓ గోల్డ్ షాపు వారి వద్ద పుస్తెలతాడు, ఉంగరాలను కరిగించి రెండు బంగారు గొలుసులు, దొంగిలించిన జత చెవి కమ్మలను కరిగించి కొత్త కమ్మలను తయారు చేయించుకున్నారు.

ఆ తర్వాత మిగిలిన వస్తువులను విక్రయించడానికని శనివారం ఉదయం ఖానాపురం మండలంలో తెలిసిన వారి వద్దకు వెళ్తుండగా వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి భయంతో పరారయ్యే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు వారిని పట్టుకొని విచారించగా తాము బంగారం, డబ్బుపై దురాశతోనే సుప్రియను చంపామని నేరాన్ని అంగీకరించారు.


దీంతో శశికాంత్, శిరీషలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారమని, వారి నుంచి నగలతోపాటు ఒక జత వెండి పట్టీలు, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ రాజగోపాల్, ఎస్సైలు జక్కుల పరమేష్, రఘుపతి పాల్గొన్నారు.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

- ఆమోదించిన అకడమిక్ సెనెట్ సమావేశం
- లోటు రూ.8.08కోట్లు, జీతాలు, ఖర్చులకు రూ.449.73 కోట్లు
- రాబడులు గ్రాంట్లుగా రూ.134.94 కోట్లు
- ఇతరత్రా రూ.296.26 కోట్లు
- విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి : వీసీ రమేష్

7

శనివారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 38.0°C	కనిష్ఠం : 23.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	ఆదివారం	సా : 6.34 గం..
సహర్ :	సోమవారం	ఉ : 4.48 గం..

బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ

- రాజయ్యను పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు



రాంనగర్, మార్చి 30: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఆరూరి రమేశ్ బీజేపీలో చేరడం, ఆ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య తాను పోటీ చేయలేనంటూ తప్పుకోవడం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవడం బీఆర్ఎస్ శ్రేణులను గందరగోళంలో పడేశాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక కోసం అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. బీఆర్ ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించగా.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాయబారం నడుపుతున్నట్లు తెలిసింది. రాజయ్యను ఒప్పించిన పల్లా.. మాజీ సీఎం కేసీఆర్ వద్దకు ఒకటిరెండు రోజుల్లో రాజయ్యను తీసుకెళ్లే అవకాశాలున్నట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్‌లో చేరాలనుకున్న రాజయ్యకు ఆ పార్టీ నుంచి ప్రతికూల పరిస్థితులు రావడంతో తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలు స్తోంది. ఇక నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికె ట్ ఆశిస్తుండగా.. ప్రస్తుతం ఆమె వరంగల్ జడ్పీ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. డాక్టర్ రాజయ్య, పెద్ది స్వప్న ఇద్దరిలో ఒక రికి బీఆర్ఎస్ టికెట్ వచ్చే అవకాశాలున్నాయనే వార్త లు వినిపిస్తున్నాయి. అలాగే ఉద్యమకారుల్లో మాజీ కార్పొరేటర్లు బోడ డిన్నా, జోరిక రమేశ్, చింతల యాదగిరితోపాటు వీరేందర్, భైరి నిరంజన్ పోటీ పడుతున్నారు. వీరిలో బోడ డిన్నా శనివారం ఎర్రవెల్లికి వెళ్లి కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. జోరిక రమేశ్ తోపాటు మిగతా వారు తమ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాగా ఆదివారం కేసీఆర్ జనగామ పర్యటన నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు.

నేడు ఉమ్మడి జిల్లా లయన్స్ సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, మార్చి 30: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 80 లయన్స్ క్లబ్‌లకు చెందిన వేడుక లయన్స్ సమ్మేళనం ప్రస్తుత 320 - ఎఫ్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో ఆదివారం వైభవంగా జరుగనుంది. హనుమకొండ ములుగురోడ్‌లోని బీఆర్‌ఆర్ గార్డెన్స్ వేదికగా జరిగే వేడుకల్లో లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ జి.బాబురావు, మల్టిపుల్ నాయకులు పూర్వ గవర్నర్లతో సహా సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే వేడుకల్లో భాగంగా సాయంత్రం ఎస్‌వీడీజీ ఎన్నిక జరుగనుంది. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కాకతీయ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకల విజయవంతానికి ప్రత్యేకంగా వివిధ కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున లయన్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈసారి ప్రత్యేకంగా పలు స్పెషాలిటీక్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. హంగర్ రిలీఫ్ పేరిట తాను ఎన్నికైనప్పటి నుంచి ఈ రోజు వరకు నిరంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముఖ్యంగా హనుమకొండ పట్టణ ప్రాంతంలోని నాలుగు క్లబ్‌లతో పాటు జనగామ, తొర్రూరు, స్టేషన్ ఘన్‌పూర్, చేర్యాల, మహబూబాబాద్ పట్టణాలలో లయన్స్ క్లబ్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో పాలకుర్తి, మొండ్రాయి, ములుగులాంటి పలు క్లబ్‌లు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు బ్యాంకు సేవలు యథాతథం

వరంగల్ చౌరస్తా, మార్చి 31: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మార్చి 31 ఆదివారంతో ముగియనున్న వేళ దేశ వ్యాప్తంగా ఆదివారం అన్ని బ్యాంకులు లావాదేవీలు నిర్వహించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఆదివారం కూడా సేవలను అందించనున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే లావాదేవీలు, నగదు, చెల్లింపు ఆర్టీజీఎస్ నెఫ్ట్, చెక్కుల చెల్లింపు, క్లియరెన్స్ లాంటి సేవలు పనిచేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే.! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్టుహౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహంచి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

● ఆమోదించిన అకడమిక్ సెనెట్ సమావేశం ● విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి: వీసీ



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య తాడికొండ రమేష్

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.431.20కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించింది. శనివారం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన విశ్వవిద్యాలయం సెనెట్‌హాల్‌లో జరిగిన 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరవేణి బడ్జెట్ ప్రవేశపెట్టారు. యేడాదిపాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లు, ఉద్యోగ విరమణ భత్యాలు, ఇతర ఖర్చులకు రూ.449.73కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.134.94కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.296.26కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో యూజీసీ నుంచి బకాయిల రూపంలో రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజు రూపంలో రూ.8కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.24.28కోట్లు, పరీక్షల విభాగం ద్వారా రూ.58.79కోట్లు రాగలవని అంచనా వేశారు. ఖర్చులను, రాబడులను ఆచార్య అమరవేణి ఎనిమిది అంశాల్లో చూపించారు. అదే సమయంలో రూ.8.08కోట్లు లోటు ఉంటుందని వెల్లడించారు. రుసా నిధులు రూ.44కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్‌లకు రూ.207.44 కోట్లు, పరీక్షలు, అకడమిక్ కార్యక్రమాలకు రూ.63.44కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

అందరి కృషి

విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి ఉందని వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ తన నివేదికలో పేర్కొన్నారు. న్యాక్ ఏప్లస్ గ్రేడింగ్ సాధించడం ఒక గొప్ప అంశమని అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులు, రాష్ట్ర ప్రభుత్వ, ఇతర సంస్థల సహకారంతో అకడమిక్, పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల సంక్షేమం, ఇత ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కెహబ్, పీవీ విజ్ఞాన కేంద్రం, పరిపాలన భవన్‌లో రెండోఅంతస్తు, డైనింగ్ హాల్, బాలికల వసతి గృహం విస్తరణ, దూర విద్య కేంద్రంలో మీడియా సెంటర్ పునరుద్ధరణ అభివృద్ధి పనుల్లో ఉన్నాయన్నారు.

ఒప్పందాలు

అకడమిక్‌పరంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు, జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షకు శిక్షణ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందటంలో ప్రోత్సాహం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై 40 రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు ఐదేళ్ల విరామం తర్వాత పీహెచ్‌డీ ప్రవేశాలు విజయంతంగా నిర్వహించినట్లు వీసీ వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ నుంచి అవార్డులు పొందినట్లు తెలిపారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించామని, అలాగే విభాగాలు, కళాశాలల్లో కూడా అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

ఉద్యోగుల సంక్షేమం

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నట్లు వీసీ ఆచార్య రమేష్ తెలిపారు. దినసరి వేతన ఉద్యోగుల జీతాలు పెంచినట్లు తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో పెరుగుతాయన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన భత్యాలు, రెగ్యులర్ ఉద్యోగుల పీఆర్సీ బెనిఫిట్స్ చెల్లించామన్నారు. గవర్నర్ ఆర్డర్ల ప్రకారం పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెమ్యునరేషన్‌లు పెంచామన్నారు. పరిమిత, నియమిత ఆర్థిక, మానవ వనరులతో సమష్టి కృషితో ముందుకు పోతున్నామన్నారు.

కోర్సులు

పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం నిధులు, నియామకాలకు ముందుకు రావాలని, దూర విద్యాకేంద్రంలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. పూర్తిస్థాయి అకడమిక్ సెనెట్ ఉండాలన్నారు. మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య విద్యావతి మాట్లాడుతూ.. పలు విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత చాలా ఉందని అన్నారు. పరిశోధనలు నిరంతరం జరగాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దని, నిధులను సమీకరించాలని అన్నారు. అకడమిక్ సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని విచారం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ పెరగడం లేదని అన్నారు. యూనివర్సిటీలు బాగుపడాలంటే నియామకాలు జరగాలని అభిప్రాయపడ్డారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడం అభినందనీయం అన్నారు. మరో అకడమిక్ సెనెట్ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ పాలనలో మహిళా నాయకత్వం పెరగడం అభినందనీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు, విశ్రాంత ఎకానమిక్స్ విభాగ ఆచార్యులు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ.. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూనివర్సిటీ ముందుకు దుసుకొనిపోతున్నదన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి నిధులు రాబట్టాన్నారు. డీన్‌లు ఆచార్య ఎస్.రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. గెస్ట్ ఫ్యాకల్టీ నియామకంతో విద్యా విభాగం బలోపేతమైందన్నారు. స్నాతకోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ.. సమష్టి కృషితో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. ఆచార్య సురేష్‌లాల్, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య ఎస్.నరసింహచారి మాట్లాడారు. అనంతరం సమావేశం బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.

వార్షిక నివేదికలకు ఆమోదం

వార్షిక నివేదికలను కూడా సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోనే ఇతర విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా ముందుకు పోతోందన్నారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఇటీవల మృతి చెందిన అకడమిక్ సెనెట్ సభ్యుడు పోకల చందర్ అకాల మరణానికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ దృశ్య, శ్రవణ విధానం ద్వారా మూడేళ్లలో విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగపు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం కృష్ణయ్య నియమితులైనందుకు సమావేశం అభినందనలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

గీసుగొండ, మార్చి 30 : గొర్రెకుంటకు చెందిన పారిశుధ్య కార్మికురాలు శనివారం పనులకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ కిందపడగా తీవ్రంగా గాయపడింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం తడుగుల సంపూర్ణ అటెండెన్స్ కోసం గొర్రెకుంట క్రాస్ వద్ద ఫింగర్ ప్రింట్ వేసి తిరిగి తన అల్లుడు రాంబాబు ద్విచక్ర వాహనంపై గొర్రెకుంటకు బయలుదేరింది. ఈక్రమంలో ఏకశిలా జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆమె టైర్ కిందపడి రెండు కాళ్లు విరిగాయి. రాంబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఇదే ప్రాంతంలో ఐదేళ్లలో దాదాపు 30రోడ్డు ప్రమాద ఘటనలు జరిగి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ మార్కెట్ నుంచి వాహనాలు ఇటువైపు నిరంతరం వెళ్తుంటాయని ఈ జంక్షన్ వద్ద మూలమలుపు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి తెలిపారు. ఈ రోడ్డును విస్తరించాలని కోరారు.

టీఎస్ఎస్‌పీ ఆర్ఐకి పదవీ విరమణ సన్మానం



దయాశీల దంపతులను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

సంగెం, మార్చి 30 : మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ దయాశీలకు పదవీ విరమణ సన్మానం జరిగింది. కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్ఐలు శోభన్, రాజిరెడ్డి, రమేష్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రన్న,రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో విశిష్ట సేవలు

▸▸ ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్



బుచ్చయ్య దంపతులను గజమాలతో సన్మానిస్తున్న ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టీఎన్జీవోస్ నాయకులు

వరంగల్ మెడికల్, మార్చి 30: క్రమశిక్షణ, నిబద్ధతతో ఎంజీఎం ఆఫీస్ సూపరింటెండెంట్ బజ్జూరి బుచ్చయ్య తన విధులను సక్రమంగా నిర్వర్తించారని ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన బజ్జూరి బుచ్చయ్య-రమాదేవి దంపతులను గజమాల, సన్మానపత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ఎంవోలు డాక్టర్ మురళీ, డాక్టర్ శ్రీనివాస్, ఎంజీఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకేశి శిరీష్‌కుమార్, టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా కార్యదర్శి గాదె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్‌సుందర్, కత్తి రమేష్, లక్ష్మీప్రసాద్, ఎంజీఎం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రవీందర్, కోశాధికారి నాగేశ్వర్, ఏడీ లక్ష్మిరాజ్యం, నగర అధ్యక్షులు వెలిశాల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, గద్దల రాజు, సంయుక్త కార్యదర్శి వంగ రవీందర్, భానుప్రకాశ్, శ్రీకాంత్, శ్రీలక్ష్మి, ఉదయ్, రమణ, యాదగిరి, రమేష్ భాస్కర్, గోపి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అకౌంట్‌ల ఫ్రీజింగ్‌ని నిరసిస్తూ రాస్తారోకో



కొనాయిమాకుల వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

గీసుగొండ, మార్చి 30 : కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పార్టీ అకౌంట్‌లను కేంద్ర ప్రభుత్వం ఫ్రీజింగ్ చేయటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై కొనాయిమాకుల వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుండటంతో ఓర్వలేక, పార్టీ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని కేంద్రం దిగజారు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. జోడోయాత్రతో రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా ఆదరణ పెరిగిందని, దీనిని తట్టుకోలేక పోతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఎంపీపీ భీమగాని సౌజన్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, నాయకులు కూసం రమేష్, నాగారపు స్వామి, దూపాకి సంతోష్, కొండేటి కొమురారెడ్డి, వజ్ర రాజు, రహీంపాష, ఆకుల మధు, మేకల రాజ్‌కుమార్, మర్రి క్రాంతి, అనిల్ రాజు, పవన్ పాల్గొన్నారు.

కౌటిల్య పాఠశాలలో ఘనంగా స్కూల్ డే



పాఠశాలలో ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

కరీమాబాద్, మార్చి 30 : కరీమాబాద్‌లోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్‌లో శనివారం గిజూబాయి విద్యాభ్యాస వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. కరస్పాండెంట్ కోడెం శ్రీధర్ ఆధ్వర్యంలో, ప్రధానోపాధ్యాయురాలు కోడెం సబిత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖిలావరంగల్ మండల ఎంఈవో ఎస్.విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, విద్యపై ఆసక్తి కనబరిచి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కరస్పాండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాభ్యాస విధానం, విద్యార్థుల లక్ష్యాలు, విజయాలు, భవిష్యత్తు ప్రణాళిక విషయాలను సూచించారు. గిజూబాయి బాధ్యులు మహేందర్ మాట్లాడుతూ గిజూబాయి సంస్థ నిర్వహించే విద్యాభ్యాస తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో వడుప్సా మండల ప్రెసిడెంట్ ఎం.రవీందర్, సెక్రటరీ సతీష్ మూర్తి, వరంగల్ మండల ప్రెసిడెంట్ క్రాంతికుమార్, సెక్రటరి వి.శ్రీనివాస్, ట్రెజరర్ మోహన్ పాల్గొన్నారు.

ఆకతాయిలకు షీ టీం కౌన్సెలింగ్



శంభునిపేట జంక్షన్‌లో ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న షీ టీం బృందం

కరీమాబాద్, మార్చి 30 : రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించిన షీ టీం బృందం ఆకతాయిలను పట్టుకుని కౌన్సె లింగ్ ఇచ్చారు. శనివారం షీ టీం ఇన్‌స్పెక్టర్ సుజాత ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 15 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. సుజాత, మిల్స్‌కాలనీ ఎస్సై గోవర్ధన్ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించేందుకు షీ టీం పనిచేస్తుందని, ఎలాంటి సమయంలోనైన మహిళలరక్షణకు చర్యలు చేపడుతాయన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందితే నిందితులకు చట్టపరంగా శిక్షించడం జరుగుతుందన్నారు. వాట్సప్‌లల్లో, ఫేస్‌బు క్‌లో, ఇన్‌స్టాగ్రాంలో మరేవిధంగానైన మహిళలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైతే 87126 85257, 87126 85142, 87126 85270 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు కుమారస్వామి, విద్యాసాగర్, హెచ్‌సీ బిచ్య నాయక్, వీరేందర్, సూర్యనారాయణ, బండి భాస్కర్, రామిరెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

భవనం బలహీనం

▸▸ మంటల దాటికి దెబ్బతిన్న జకోటియా మాల్

▸▸ ప్రభుత్వ శాఖలకు లేఖ రాసిన పోలీసులు

మట్టెవాడ, మార్చి 30 : వరంగల్ పోచమ్మమైదాన్ జకోటియా షాపింగ్ మాల్ భారీ అగ్ని ప్రమాదంలో మంటల దాటికి బలహీనపడినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మంటల దాటికి భవనంలోని వస్తు సామగ్రి, ఎలక్ట్రిక్ వస్తువులు, ఫ్రిజ్‌లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఏసీలు, ఫర్నిచర్ కాలిపోవడంతో మంటలు బాగా ఎగిసిపడ్డాయి. దీంతో కాంప్లెక్స్‌లోని రెండు, మూడు భవనం దెబ్బతిన్నట్లు గుర్తించారు. హార్కిటెక్చర్, భవన నిర్మాణ ఇంజనీరింగ్ నిపుణులు, ఆర్ అండ్ బీ శాఖ పూర్తి స్థాయిలో భవనాన్ని పరిశీలించాక నిపుణులు నివేదిక ఇచ్చిన తర్వాతనే భవనం నాణ్యతపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



కాలిపోయిన జకోరియా కాంప్లెక్స్ భవనం

ప్రభుత్వ శాఖలకు పోలీసుల లేఖ..

జకోటియా కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదంపై మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో పోలీసు శాఖ పూర్తి స్థాయి విచారణ చేపట్టడం కోసం శనివారం వివిధ ప్రభుత్వ శాఖలకు లేఖలు రాశారు. అగ్ని ప్రమాద ఘటనపైన శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలు ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు. విద్యుత్ శాఖ, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్, అగ్ని మాపక శాఖ, ఆర్ అండ్ బీ శాఖ, ఫోరెన్సిక్ ల్యాబ్, క్లూస్ టీమ్‌లకు పోలీసులు లేఖలు రాశారు. ఘటనపై దర్యాప్తు కోసం వివిధ ప్రభుత్వ శాఖల విచారణ నివేదికలే కీలకంగా మారనున్నాయి.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో సెంట్రల్ జీఎస్టీ కమిషనర్

వరంగల్ కల్చరల్, మార్చి 30 : చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఐఆర్ఎస్ అధికారి సందీప్ ప్రకాష్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న సందీప్ ప్రకాష్ దంపతులు ఆలయ పరిసర ప్రాంగణాలను తిలకించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన సెంట్రల్ జీఎస్టీ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని సందీప్ ప్రకాష్ దంపతులకు అందజేశారు.



సెంట్రల్ జీఎస్టీ కమిషనర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు షురూ



ప్రతిష్ఠాపనకు సిద్ధం చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సభ్యులు

కరీమాబాద్, మార్చి 30 : నగరంలోని 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. వేణునాథాచార్యుల ఆధ్వర్యంలోపూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులకు దీక్ష కంకణం, అనంతరం అంకురార్పణ, పుణ్యాహవచనం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రతిష్ఠాపనకు ఏర్పాటు చేసిన అభయాంజనేయాస్వామి విగ్రహానికి కమిటీ సభ్యులు పూజలు జరిపారు. దీంతో గణేష్‌నగర్ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో ఆప్రాంతం మార్మోగుతోంది.

విస్తృతంగా వాహనాల తనిఖీ

చెన్నారావుపేట, మార్చి 30 : మండలంలోని నెక్కొండ- నర్సంపేట ప్రధాన రహదారిపై విస్తృతంగా వాహన తనిఖీ లను పోలీసులు శనివారం చేశారు. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అక్రమ మద్యం, డబ్బుల కట్టడికి తనిఖీలు

▸▸ వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, మార్చి 30 : లోక్‌సభ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో వరంగల్‌లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపడుతున్నట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. శనివారం రాత్రి వరంగల్ నర్సంపేట రోడ్ గొర్రెకుంట క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరాం నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బుల కట్టడికి ఎన్నికల కోడ్ అమలు చేస్తూ వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. రూ.50వేలకు మించి నగదు తరలిస్తే స్వాధీన పర్చుకుంటామన్నారు. వాహన తనిఖీలకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ తనిఖీల్లో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెకుంట క్రాస్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏసీపీ

రసాయనాలతో పండ్లను మాగబెడితే చర్యలు

▸▸ పండ్ల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

▸▸ అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 30: పండ్ల వ్యాపారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, కృత్రిమంగా పండ్లను మాగబెట్టి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో పండ్లు మాగబెట్టే విధానంపై వరంగల్ జోనల్ ఆహార పరిరక్షణ విభాగం ఆఫీసర్ అమృతశ్రీతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ పండ్లను మాగబెట్టేందుకు వాడే కాల్షియం కార్బైడ్‌ను ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, ఇథలిన్ పౌడర్‌ను ఎక్కువ మోతాదులో వాడటం ప్రమాదకరమన్నారు. వ్యాపారులు సహజ సిద్ధంగా పండించిన పండ్లను మాత్రమే వినియోగదారులకు అందించాలని స్పష్టం చేశారు. వ్యాపారులు కలుషిత రసాయనాలతో పండ్లను మాగబెట్టినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సైతం దాడులు నిర్వహించాలని ఆదేశించారు. సదస్సులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి, జిల్లా హార్టికల్చర్ విభాగం అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ ఎండి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

గోవిందా.. గోవిందా

ఘనంగా కొమ్మాల బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేస్తున్న వేదపండితులు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వేదపండితులు

గీసుగొండ, మార్చి 30 : కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత లక్ష్మీ నృసింహుని రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమై శనివారం తెల్లవారుజాము వరకు వైభవంగా సాగింది. శ్రీలక్ష్మీనరసింహుడు, భూదేవి, నీలాదేవిలు ఆసీనులైన రథోత్సవం (ఆలయగుట్ట చుట్టూ ప్రదక్షిణ) కన్నుల పండువగా జరిగింది. రథాన్ని లాగటానికి భక్తులు పోటీపడ్డారు. ఆలయ ఆవరణ గోవిందా స్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కాందూరి రామాచార్యులు, విష్ణుమాచార్యులు, ఫణీంద్రాచార్యులు, వెంకటాచార్యులు ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, సాయిలి ప్రభాకర్, ఉత్సవకమిటి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవమూర్తులకు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు రథోత్సవం అనంతరం భక్తిశ్రద్ధలతో శనివారం వేదపండితులు చక్రస్నానం చేయించారు. పుష్పయాగం, నాగవెల్లి అనంతరం రాత్రి స్వామివారిని విశ్వనాథపురం పారువేట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, ఈవో శేషగిరిరావు, అర్చకులు రామాచార్యులు, విష్ణుమాచార్యులు, ఫణీంద్రాచార్యులు, వెంకటేశ్వరచార్యులు, రవిందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు



రథోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు



వధూవరులు ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

గీసుగొండ, మార్చి 30 : ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, భార్గవి దంపతుల కుమార్తె శ్రియ, ప్రణీత్‌కుమార్‌ల వివాహం వరంగల్‌లోని భద్రకాళీ కీర్తి గార్డెన్‌లో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు నర్సంపేట, హనుమకొండ, పరకాల ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి ప్రసాద్, డాక్టర్ బుచ్చిరెడ్డి, ఆదిగురు దేవస్థానం ప్రధాన అర్చకులు కాందూరి వేంకటాచార్యులు, గీసుగొండ ఎంపీపీ భీమగాని సౌజన్య హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలి

▸▸ వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని

వర్ధన్నపేట రూరల్, మార్చి 30: వర్ధన్నపేట నియోజక వర్గ ప్రజలు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నే ని రవీందర్‌రావు ఆకాంక్షించారు. శనివారం మండలంలోని బండౌతపురం, అంబేడ్కర్ గ్రామాల శివారులో నాబార్డు వారిచే ప్రవేశపెట్టిన ఎంఎస్‌సీ స్కీంలో ఎఫ్ఎస్‌సీఎస్ గోదాం ఆవరణలో నిర్మించిన ఫంక్షన్ హాల్‌లో సీతారాము ల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల నడుమ స్వామివారి కల్యాణాన్ని అంగరం గ వైభంగా నిర్వహించారు. అనంతరం కల్యాణానికి విచ్చేసిన వివిధ గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజ ల కోసం నాబార్డు సహకారంతో ఎంతో సర్వంగా సుంద రంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించుకున్నామని, ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కొత్త రూపు దాల్చిందని, రాష్ట్రాభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, వరంగల్ డీసీవో నాగేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భద్రునాయక్, వర్ధన్నపేట మేనేజర్ సమత, ఐనవోలు ఎంపీపీ మార్నేని మధుమతి, నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, పాలకవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, సంపత్, చిరంజీవి, కుమార్, సంపత్, బిర్రు పద్మ, రాంచంద్రు, ఎలిషా, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కుండ.. సల్లగుండ..

▸▸ పెరుగుతున్న కుండల విక్రయాలు

▸▸ ఆరోగ్యకరం కావడంతో ఆసక్తి..

▸▸ రాజస్థాన్ కుండలకు భలే డిమాండ్

వరంగల్ చౌరస్తా, మార్చి 30: వేసవి వచ్చిందంటే పేదవాడికి అత్యవసర మైనది కుండలే. అందుకే పేదల ఫ్రిజ్‌గా గుర్తింపు పొందిన కుండలకు భలే గిరాకీ ఉంటుంది. వీటికి తోడు కుండలో నీరు తాగడం ఆరోగ్యదాయకం కావడంతో ఎగువ మధ్య తరగతి కుటుంబాలు కూడా కుండల కొనుగోలు ఉత్సాహం చూపుతుంటారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో కుండల విక్రయాలు జోరందుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో మట్టితో తయారైన కుండలకు డిమాండ్ ఎక్కువే. 10 లీటర్లు, 15 లీటర్లు, 20 లీటర్ల సామర్థ్యంతో రాజస్థాన్ కుండలను నగరంలో పలుచోట్ల విక్రయిస్తున్నారు. చూడ్డానికి అందంగా కనిపిస్తున్నాయి. కాగా, 10లీటర్ల కుండ ధర రూ.300, 15 లీటర్లది ధర రూ.350, 20లీటర్లది ధర రూ. 400 ధర పలుకుతోంది. వరంగల్‌లోని మునిసిపాలిటీ కార్యాలయం సమీపంలో, హెడ్‌పోస్టాఫీసు గల్లీ, వెంకట్రామ జంక్షన్, దేశాయిపేట రోడ్డులో రాజస్థాన్ కుండలను విక్రయిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ప్రజలు ఈ కుండలను కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్ రంజన్‌లు కూడా చల్లగా ఉంటాయి. రాజస్థాన్ మట్టికుండల్లో నీరు చల్లగా ఉండి రుచికరం అనిపిస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. దీంతో ఏటా వేలల్లో కుండలను కొనుగోలు చేస్తుంటారు. ఈ కుండలు చూడ్డానికి అందంగా ఉండడంతో వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన వారు కూడా కొనుక్కొని వెళ్తున్నారు.



కుండను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న మహిళ



లారీలో నుంచి దింపుతున్న కుండలు



వరంగల్ మునిసిపల్ కార్యాలయం సమీపంలో విక్రయిస్తున్న రాజస్థాన్ కుండలు

పదేళ్ల నుంచి విక్రయిస్తున్నాం..

కిశోర్, రాజస్థాన్ కుండల విక్రయదారుడు



పదేళ్ల నుంచి రాజస్థాన్ నుంచి వరంగల్‌కు కుండలు తీసుకొచ్చి విక్రయిస్తున్నా. మార్చి నుంచి మే వరకు అమ్మకాలు జోరుగా సాగుతాయి. సైజు బట్టి ఒక్కోకుండ రూ.300 నుంచి రూ.500 వరకు ఉంది. సీజన్‌లో దాదాపు 5వేల వరకు కుండలను విక్రయిస్తాం.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఖానాపురం, మార్చి 30 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధరావుపేట గ్రామానికి చెందిన బాలుడు శుక్ర వారం రాత్రి మృతి చెందాడు. శనివారం ఎస్సై రఘుపతి తెలిపిన కథనం ప్రకారం.. బుధరావుపేట గ్రామానికి చెందిన ఎస్కే ఉబేదుల్లా(10) శుక్రవారం సాయంత్రం నమాజ్ పూర్తయిన తరువాత బుధరావుపేటలో జాతీయ రహదారి పక్కన ఉన్న మజీద్‌లో జరిగే ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుంచి గూడూరు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

బాధితున్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి బాలుడి మృతికి కారకుడైన కేసముద్రం మండలం మహబూబ్‌పట్నంకు చెందిన కాసోజు వెంకటాచారిపై బాలుడి మేనమామ అబిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆడిటోరియం అందుబాటులోకి వచ్చేదెన్నడో?

ఐదేళ్లుగా కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

సమావేశాలు నిర్వహించుకోవడానికి భవనంలేక ప్రజల ఇక్కట్లు

నర్సంపేట టౌన్, మార్చి 30 : ప్రజలు సాంస్కృతిక ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా నర్సంపేట పట్టణంలోని ద్వారక పేటరోడ్‌లో పశు వైద్యశాలకు సమీపంలో 2019లో ప్రారంభించిన పాఖాల ఆడిటోరియం భవన నిర్మాణ పనులు నత్తనడకన ఆరేళ్లుగా కొనసాగుతున్నాయి. ఆడిటోరియం భవనం అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయి. ఐదేళ్లుగా పనులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో భవనం ప్రజలకు కలగానే మిగిలిపోయింది. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.5 కోట్ల నిధుల వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణ పనులను 2019, జులై 10న నాటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు ఆరేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. నిధులు సరిపోకపోవడంతో మరో రూ.1 కోటిని ప్రభుత్వం మంజూరుచేసింది. ప్రస్తుతం తుది దశకు చేరుకున్న భవన నిర్మాణ పనులు నిధుల లేమితోనో, మరేమైనా కారణంతోనో పనులను కాంట్రాక్టర్ గత కొద్ది రోజుల క్రితం నిలిపివేశాడు. దీంతో భవనాన్ని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో సీలింగ్, ఇతర నిర్మాణాలు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆడిటోరియం భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో తుది దశకు చేరినా భవనం అందుబాటులోకి రావడంలేదు. నామమాత్రపు ఫీజుతో సభలు, సమావేశాలు నిర్వహించడానికి ఉపయోగపడే ఆడిటోరియం లేక వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించి ఆర్థికపరమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.



కొనసాగుతున్న ఆడిటోరియం భవన నిర్మాణ పనులు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంగా మారిన గెస్ట్ హౌజ్

నర్సంపేట పట్టణం రాజకీయ, వ్యాపార, వాణిజ్యరంగంలో జిల్లాలోనే ప్రధానమైనది. అటువంటి పట్టణంలో సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వపరమైన భవనాలులేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు సమావేశాలు నిర్వహించుకోవడానికి పట్టణంలోని ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌజ్ ఉపయోగపడేది. ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గెస్ట్ హౌజ్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంగా మార్చుకోవడంతో ప్రస్తుతం సమావేశాలు నిర్వహించుకోవడానికి భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆడిటోరియం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు ఎండిపోతున్నాయ్..!

నీరులేక విలవిలలాడుతున్న మొక్కలు

రూ. లక్షలు వెచ్చించి వదిలేసిన అధికారులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 30 : అసలే వేసవి కాలం. నీరు లేకపోతే మొక్కలు దక్కే పరిస్థితి లేదు. లక్షల రూపాయలు వెచ్చించి ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణ పట్ల అధికారుల పర్యవేక్షణ కొరవడి ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ఏకంగా వర్ధన్నపేట పురపాలక సంఘం కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం, ప్రజాప్రతినిధు లు దృష్టి సారించకపోవడంతో సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు మాడిపోయే పరిస్థితి వచ్చింది. పట్టణంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహ దారిపై కొత్త బస్టాండ్ నుంచి పల్లెబాటకు వెళ్లే శ్మశాన వాటిక వరకు, అంబేడ్క ర్ సెంటర్ నుంచి పిరంగిగడ్డవరకు ఏర్పాటుచేసిన డివైడర్‌లో పూల మొక్కలు, షో చెట్లునాటారు. కొన్ని రోజులపాటు వీటి నిర్వహణ బాగానే చూసుకోవడంతో పూలతో, పచ్చటి ఆకులతో అం దంగా కనిపించాయి. కొన్ని రోజులుగా వీటిని పట్టించుకోకుండా నీటిని సైతం పోయకుండా ఉండడంతో వెలవెలబోయి కనిపి స్తున్నాయి. దీంతో పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మునిసిపాలిటీ అధికారులు వాటర్ ట్యాంకుతో కొన్ని రోజులు నీరందించి, ఇప్పుడు తీరా వేసవి కాలం వచ్చిన తర్వాత సంరక్షణ పట్ల ఆసక్తి చూపటంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మొక్కలకు నీరందించి ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి మిగతా మొక్కలు బతికేలా చూడాలని కోరుతున్నారు.



నీరు లేక ఎండిపోయిన మొక్క



జాతీయ రహదారిపై డివైడర్‌లో ఎండిపోతున్న మొక్కలు

ఫోన్ చేసినా కమిషనర్ స్పందించడంలేదు...

నాగెల్లి సురేష్, వర్ధన్నపేట పట్టణవాసి



మునిసిపాలిటీ సమస్యల పై నేరుగా కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తడం లేదు. సమస్యలు చెప్పుకుందామని వెళితే స్పందించడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి పెట్టిన మొక్కల నిర్వహణ పట్ల అశ్రద్ధ చూపడం సరికాదు. వెంటనే సిబ్బందితో మొక్కలకు నీరందించి వాటిని పెంచేలా చూడాలి.

విస్తృతంగా వాహనాల తనిఖీ

చెన్నారావుపేట, మార్చి 30 : మండలంలోని నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారిపై విస్తృతంగా వాహన తనిఖీలను పోలీసులు శనివారం చేశారు. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన రహదారిపై సీసీ కెమె రాలతో నిఘాను ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రత్యేక అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అనిల్‌రావు



పర్వతగిరి, మార్చి 3 : సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

విద్యా కేంద్రంగా నర్సంపేట

- నాణ్యమైన విద్యను అందించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, మార్చి 30 : జిల్లాలోనే నర్సంపేట నియోజకవర్గం విద్యాకేం ద్రంగా విరాజిల్లుతుందని ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి అన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవ సమావేశాన్ని పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్ అధ్యక్షతన నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్యతిథిగా హాజరైన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒక్కో విద్యార్థిపై రూ.87వేల వంతున ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం లక్షలాది రూపాయలను వెచ్చిస్తుందన్నారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్య విద్యను అందించి విద్యార్థులు భావి భారత పౌరులుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఇంజనీరింగ్, వైద్య విద్య అందించే స్థాయికి నర్సంపేట ఎదిగిందన్నారు. పిల్లల చదువు విషయంలో తల్లి దండ్రులకు భారం పడకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలు విద్యారంగంలో నర్సంపేటను అగ్రగామిగా నిలుపాలని ఆయన సూచించారు. ఉద్యోగ అవకాశాలు అందరికీ వచ్చే అవకాశాలు లేనందన విద్యావకాశాలు దక్కని వారు స్వయం ఉపాధి పొంది జీవనం కొనసాగించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంజీవని అనాథశ్రమ చైర్మెన్ డాక్టర్ ఎ.మోహన్‌రావు, ఉపాధ్యాయులు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, మార్చి 30: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలంటే సీఎం రేవంత్‌రెడ్డితోనే సాధ్యమని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండంలోని వివిధ గ్రామాల్లో ఝాన్సీరెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. కొలన్‌పెల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 40 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం గ్రామంలోని గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన సురమాంబదేవి కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెర్కవేడులో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఉగా మునిత సుధాకర్‌ల కుమార్తెలు సాత్విక, సిరిచందనల నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. దుబ్బతండాలోని దుర్గమ్మ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాయపర్తి మార్గ మధ్యలో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షాలు కండ్లు తెరిచిచూస్తే పంట పొలాలు పచ్చగా కనిపిస్తాయన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ పార్టీపై రుద్దాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, ముద్దరబోయిన వెంకన్న, దామోదర్, గబ్బెట బాబు, గుగులోతు శ్రీనివాస్, తీగల సాయిలు, సుతారి యాదగిరి, షాపురం సాయిలు, ఊగ ప్రశాంత్, బండికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

దుగ్గొండి, మార్చి 30 : సహకారం సంఘం పరిధిలోని వివిధ గ్రామాల రైతులకు అందుబాటులో ఎరువులను గోదాములలో నిల్వ చేసి సరియైన ధరలకు విక్రయాలు చేస్తామని నాచినపల్లి సొసైటీ చైర్మన్ సుకినె రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని నాచినపల్లి సహకారం సంఘం 31వ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సంఘం పరిధిలోని నాచినపల్లి, లక్ష్మీపురం, తిమ్మంపేట, తొగర్రాయి గ్రామాల్లో ఎరువుల కొరత లేకుండా రైతులకు పంటల సాగుకు సరిపోయే విధంగా ఎరువులను ఉంచుతామని, గత ఏడాది కాలంలో ఎరువులపై వ్యాపారంలో రూ.2,20,000లాభం వచ్చినట్లు వెల్లడించారు. నూతనంగా 104మంది రైతులకు అప్పుల పరంగా రూ.78,58,000 ఇచ్చినట్లు తెలిపారు. రుణమాఫీ 658మందికి రూ.2,81,16,844 వచ్చిందని, ధాన్యం కొనుగోలుపై రూ.3,01,188 లాభం గత ఏడాద కాలంలో వచ్చిందన్నారు. సభలో వైస్ చైర్మన్ గుడిపల్లి దర్మారెడ్డి, డైరెక్టర్లు నరహరి భాస్కర్‌రెడ్డి, కోమాండ్ల సూరారెడ్డి, పురుషోత్తం, అజ్మీరసాంబయ్య, నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, మొగిడే ప్రభాకర్, లలితబాబు, నరహరి సునిత రాజ్‌కుమార్‌రెడ్డి, సీఈవో సోమ ఓంకార్, సిబ్బంది పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ విజయోత్సవ ర్యాలీ

నల్లబెల్లి, మార్చి 30 : మండల కేంద్రంలో శనివారం సీఎస్ఐ చర్చి నుంచి జీసస్ గాస్పల్ చర్చివరకు క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల పాస్టర్స్‌ల కమిటీ అధ్యక్షుడు మత్తయ్య మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే ముగిసిన అనంతరం ఏసుప్రభు సమాధిలో లేడని, తిరిగి సమాజ శ్రేయస్సు కోసం వచ్చాడని తెలిపారు. అందుకే రన్ ఫర్ జీసస్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నానబోయిన రాజారాం, మాజీ ఎంపీటీసీ జన్ను జయరావు, క్రైస్తవులు రెవరెండ్ ఈపీ ప్రసాద్, కె.రూబే, బి.పాల్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలి

వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్

వర్ధన్నపేట రూరల్, మార్చి 30: వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆకాంక్షించారు. శనివారం మండలంలోని బండౌతపురం, అంబేడ్కర్ గ్రామాల శివారులో నాబార్డు వారిచే ప్రవేశపెట్టిన ఎంఎస్‌సీ స్కీంలో ఎఫ్ఎస్‌సీఎస్ గోదాం ఆవరణలో నిర్మించిన ఫంక్షన్ హాల్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల నడుమ స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణానికి విచ్చేసిన వివిధ గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నాబార్డు సహకారంతో ఎంతో సర్వంగా సుందరంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించుకున్నామని, ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కొత్త రూపు దాల్చిందని, రాష్ట్రాభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, వరంగల్ డీసీవో నాగేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భద్రునాయక్, వర్ధన్నపేట మేనేజర్ సమత, ఐనవోలు ఎంపీపీ మార్నేని మధుమతి, నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, పాలకవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, సంపత్, చిరంజీవి, కుమార్, సంపత్, బిర్రు పద్మ, రాంచంద్రు, ఎలిషా, సమ్మయ్య పాల్గొన్నారు.

అకౌంట్ల ఫ్రీజ్ అప్రజాస్వామికం

వర్ధన్నపేట రూరల్, మార్చి 30 : కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయడం అప్రజాస్వామికమని మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బ తీసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఏఐసీసీ, ఎన్ఎస్‌యూఐ అకౌంట్లను ఐటీ నోటీసుల పేరుతో ఫ్రీజ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా ఐటీ, ఈడీ, సీబీఐలను ఉపయోగిస్తూ రాజకీయ పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. బీజేపీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందుకు కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టి, రాహుల్ గాంధీని ప్రధాని కాకుండా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

దుగ్గొండి, మార్చి 30 : పార్లమెంట్ ఎన్నికల కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో లెక్కల అరుంధతి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని దానికి కార్యదర్శులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, మార్చి 30: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో సీనియర్ కార్యకర్తలు ఇంగ్లీ యాకయ్య, కడుదుల సోమనర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం వారి కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్

ఖానాపురం, మార్చి 30: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 65వ మహాజన సభ సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాలు, ఎరువులు సంఘం అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, సీఈవో ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు సునీత, సాంబయ్య, అశోక్, భాగ్య రాజు, కుమారస్వామి, తిరుపతి, లక్ష్మయ్య, రమేష్, అచ్యూతం, రవీందర్‌రావు, సొసైటీ సిబ్బంది వెంకటేశ్వర్లు, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకే ఎంపీ టికెట్ కేటాయించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 30 : దళిత సామాజిక వ్యక్తికే వరంగల్ పార్లమెంటు టికెట్‌ను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన విలే కర్లతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంగా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యక ర్తలను కాపాడుకున్న వారికి టికెట్ ఇవ్వకపోవడం బాధాక రమని తెలిపారు. వరంగల్ ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు మాదిగ సామాజికవర్గానికి చెందిన దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్‌లు ఉన్నారని, వారికి కేటాయించడమే న్యాయమన్నారు.

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కష్టపడ్డ నాయకులను గుర్తించి టికెట్‌లు ఇచ్చి గెలిపించుకుందని, అలాగే వరంగల్ ఎంపీ స్థానం కూడా వారికే కేటాయించి గెలిపించుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుపెల్లి బాబు, బంగారు సదానందం, ఎర్ర శ్రీకాంత్, శివరాత్రి వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

నర్సంపేట టౌన్, మార్చి 30 : యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. నర్సంపేట మండలం మగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పట్ల ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. భారత రాజ్యాంగం, చట్టాలపై మెరుగైన అవగాహన పెంచుకొని సరైన వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడానికి ఓటు కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్, స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, కళాశాల యాజమాన్యం శంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

చెన్నారావుపేట, మార్చి 30: బాలికలు ఆత్మరక్షణ కోసం ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని హెచ్ఎం జయ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆత్మరక్షణ పద్ధతులను అందించేందుకు ఆత్మరక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఆకతాయిలు ఆగడాల నుంచి బాలికలు తమను తాము రక్షించుకోవడానికి శారీరక ధృడత్వం సాధించడం అవసరమన్నారు.బాలికలు మానసిక ఉల్లాసం కల్గించడానికి ఆత్మరక్షణ విద్య అవసరమని అన్నారు. కరాటే నేర్చుకుంటే బాలికల్లో ఆత్మరక్షణ కలుగుతుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సునీత, రాగి శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్, సుందర్, మాదవిరావు, కృష్ణా, రమేష్, రవిందర్, మోహన్‌రావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

రాయపర్తి, మార్చి 30 : రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బిల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మస్జీద్ ఏ నూర్ మసీదులో ముస్లింల కు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందు ఆరగించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, నాయకులు ఆకుల సురేందర్‌రావు, ఎండీ నయీం, చెవ్వ కాశీనాథం, అశ్రఫ్ పాషా, సుధాకర్, వేణు, హుస్సేన్, అక్బర్, అఫ్జల్, మోహినుద్దీన్, ఎల్లస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందాం



సమావేశంలో మాట్లాతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్, మార్చి 30 : కొంతమంది అవకాశవాదులు బీఆర్ఎస్ పార్టీని వీడి వెళ్లిపోయినంత మాత్రాన నాయకులు, కార్యకర్తలు భంగపడాల్సిన అవసరంలేదని, కొత్త నేతలను, కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుందామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని ఇల్లందలో ఏర్పాటు చేసిన మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీని వదిలి వెళ్లే వారంతా తమ సొంత ప్రయోజనాలు, లాభాల కోసం వెళ్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పే సమయం వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదోవిధంగా తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అమలు కానీ 420 హామీలు ఇచ్చిందని, వాటిలో ఏదీ కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. మార్పు కావాలని కోరుకున్న ప్రజలుకు బీఆర్ఎస్ పార్టీ పై ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, కరెంటు కోసం చేసిన కష్టం ప్రజలకు తెలుసన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రావు మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, గుజ్జ గోపాల్‌రావు, తుమ్మల యాకయ్య, సిలవేరు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి బోనాలు

చెన్నారావుపేట, మార్చి 30 : మండలంలోని పాపయ్యపేటలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా గౌడ కులస్తులు శనివారం రాత్రి కంఠమహేశ్వరస్వామికి బోనాలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా కంఠమహేశ్వరస్వామికి మహిళలు ప్రత్యేకంగా పాలు. పాయసం నైవేద్యంతో చేసిన బోనాలను స్వామి వారికి, ఎల్లమ్మ తల్లికి అర్పించారు. ఆలయంలో మోకు ముత్రాజులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి గౌడ్, కుల పెద్ద మేడి ప్రభాకర్, మేడి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందా... గోవిందా

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు రథోత్సవం

గీసుగొండ, మార్చి 30 : కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత లక్ష్మీనృసింహుని రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమై శనివారం తెల్లవారుజాము వరకు వైభవంగా సాగింది. లక్ష్మీ నరసింహుడు, భూదేవి, నీలాదేవిలు ఆసీనులైన రథోత్సవం (ఆలయగుట్ట చుట్టూప్రదక్షిణ) కన్నుల పండువగా జరిగింది. రథాన్ని లాగటానికి భక్తులు పోటీపడ్డారు. ఆలయ ఆవరణ గోవిందాస్మరణతో మారుమోగింది. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, కాందూరి రామాచార్యులు, విష్ణుమాచార్యులు, ఫణీంద్రాచార్యులు, వెంకటాచార్యులు ఎంపీపీ భీమ గాని సౌజన్య, ఎంపీటీసీ గోపాల్, సాయిలి ప్రభాకర్, ఉత్సవ కమిటి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవమూర్తులకు చక్రస్నానం



ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేస్తున్న వేదపండితులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు రథోత్సవం అనంతరం భక్తిశ్రద్ధలతో శనివారం వేదపండితులు చక్రస్నానం చేయించారు. పుష్పయాగం, నాగవెల్లి అనంతరం రాత్రి స్వామివారిని విశ్వనాథపురం పారువేట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, ఈవో శేషగిరిరావు, అర్చకులు రామాచార్యులు, విష్ణుమాచార్యులు, ఫణింద్రాచార్యులు, వెంక టేశ్వరచార్యులు, రవిందర్‌రెడ్డి, ఉత్సవకమిటీ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో పాట్లు

34 గ్రామ పంచాయతీలలో హరితహారం నర్సరీలు

ఎండతీవ్రత నుంచి కాపాడుటకు గ్రీన్ మ్యాట్లతో పందిళ్లు



శివాజీనగర్‌లోని నర్సరీపై గ్రీన్ మ్యాట్‌తో వేసిన పందిరి

దుగ్గొండి, మార్చి 30: మొక్కలు నాటి వాతావరణ కాలుష్యంతో పాటు భవిష్యత్ తరాలకు ఆహ్లాదం, వర్షం నీటిని పొదుపు చేయాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటుచేశారు. నర్సరీలలో పెరిగిన మొక్కలను హరితహారం పథకంలో నాటడం కోసం అధికారులు గ్రామాలలో నర్సరీలకు శ్రీకారం చుట్టారు. వర్షాకాంలో మొక్కలు నాటుటకు మండలంలోని 34గ్రామ పంచాయతీలలో పెంచుతున్న నర్సరీలకు అధిక ఉష్ణోగ్రత ప్రభావం పడింది. దీంతో నర్సరీలలో మొక్కలు పెంచుటకు సంరక్షకులు ఇబ్బందులు పడు తున్నారు. నర్సరీలలో నాటిన మొక్కలు సంరక్షణకోసం నర్సరీలపై గ్రీన్ మ్యాట్లతో పందిళ్లువేసి మొక్కలు పెరుగుటకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

నర్సరీల బాధ్యతలు

గ్రామ స్థాయిలో కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్లు, జీపీ సిబ్బంది, నర్సరీ సంరక్షకులు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు ప్రధానంగా నర్సరీల సంరక్షణ బాధ్యతలు నిర్వహించాలి. మండల స్థాయిలో ఇచ్చిన టార్గెట్ మొక్కలు పెంచుటకు గ్రామ, మండల స్థాయి అధికారులు కృషి చేయాలి. టార్కెట్ ప్రకారం వర్షా కాలంలో హారతహారంలో మొక్కలు నాటుటకు సిద్ధంగా ఉండాలి. గతంలో ఎన్నడు లేని విధంగా ఎండ తీవ్రత తాకిడి కారణంగా గ్రామాలలోని నర్సరీలలో మొక్కలు పెంచుటకు కష్టాలు తప్పడం లేదు.

అధిక ఉష్ణోగ్రతలు

ఆహ్లాదంతో పాటు భవిష్యత్ తరాలకు వర్షాప్రభావ నీటిని నిల్వ చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ఏర్పాటు చేసిన నర్సరీలు ఎండతీవ్రతలు అధికంగా ఉండడంతో నర్సరీల మొక్కలు సంరక్షణకు అవస్థలు పడుతున్నారు. 34డిగ్రీల సెల్సియస్ ఉష్ణో గ్రతలు రోజు వారిగా ఉండడంతో నర్సరీలలో నాటిన మొక్కలను కాపా డుటకు సంరక్షకులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు ఒక్కసారి నీటిని మొక్కలకు అందిస్తే సరిపోయేది, ఎండతీవ్రతల కారణంగా రోజుకు మూడుసార్లు నీటి మొక్కలకు అందించవలసి వస్తోందని సంరక్షకులు తెలుపుతున్నారు.

నర్సరీల మొక్కలు పెంచుటకు కష్టపడుతున్నాం

తోటకూరి సాంబయ్య, నర్సరీ సంరక్షకుడు, తిమ్మంపేట



నర్సరీలలో నాటిన మొక్కలు పెంచుటకు ఎండ తీవ్రతతో వాటి సంరక్ష ణ కోసం ఎక్కువ కష్టా పడవలసి వస్తోంది. గతం కంటే అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉండడంతో నాటిన మొక్కలు కాపాడుటకు అవస్థలు పడు తున్నాం. రోజుకు ఒక్కసారి నీటిని మొక్కలకు అందిస్తే సరిపోయ్యేది. కాని ఎండ ప్రభావంతో రోజుకు మూడు సార్లు నీరు అందించవలసి వస్తోంది. నాటిన మొక్కలకు ఉష్ణోగ్రతలను నుంచి కాపాడుటకు నర్సరీలపై గ్రీన్ మ్యాట్లతో పందిళ్లు వేయడం జరుగుతుంది. నాటిన మొక్కలను సంరక్షణ చేసి వర్షా కాలంలో హరితహారంలో మొక్కలు నాటుటకు నర్సరీలలో మొక్కలు సిద్ధం చేస్తున్నాం.